సాక్షి
పెద్దపల్లి
శనివారం । 4 । మార్చి । 2023



రామచంద్రస్వామికి అభిషేకం

వేములవాడ: రాజన్న సన్నిధిలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రోత్సవం సందర్భంగా అభిషేకాలు నిర్వహించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,525

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాలు ధర గరిష్టంగా రూ.7,525, కనిష్టం రూ.6,700, సరాసరి రూ.7,452 పలికింది.

గరిష్టం/కనిష్టం
35.0/20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రిలే దీక్షలు చేస్తున్నా పట్టించుకోరా



రిలే దీక్షలో సదానందం తదితరులు

పెద్దపల్లిరూరల్: జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సవరించాలంటూ 37 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పెద్దపల్లి బస్టాండ్ వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్ష శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు గడుస్తున్నా సమాజంలో 85శాతం పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణగదొక్కి కేవలం 4శాతం ఉన్న అగ్రవర్ణాలే పాలన సాగిస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మానస్‌కుమార్, ఉదయ్, స్వామి, సదానందం , రాకేశ్, శంకర్, స్వప్న, వెంకటేశ్, శారద, మధు, శేఖర్, నరేశ్ తదితరులున్నారు.

రైస్‌మిల్లు ఆపరేటర్ల వేతనాలు పెంచాలి



ధర్నా చేస్తున్న ఆపరేటర్లు, నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైసుమిల్లుల్లో ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికుల వేతనాలను కనీసం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముత్యంరావు మాట్లాడుతూ, బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు ఇష్టానుసారంగా పెంచిన పాలకులు ఆ ధరలకు అనుగుణంగ వేతనాలు ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, శరత్ రెడ్డి, మల్లేశం, కనకయ్య, రమేశ్, స్వామి, రాజయ్య, శ్రీనివాస్, రైస్‌మిల్లు ఆపరేటర్లు తదితరులున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- కలెక్టర్ సంగీత



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని కలెక్టర్ సంగీత అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో శుక్రవారం టీఎన్‌జీఓల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించిన పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. విధినిర్వహణలో నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉద్యోగులకు ఇలాంటి క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్నిస్తాయన్నారు. షాట్‌పుట్, టగ్ ఆఫ్‌వార్, బాల్‌గేమ్, లెమన్‌స్పూన్, పొటాటో గేమ్ లాంటి పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను మార్చి 8న మహిళాదినోత్సవం రోజున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారులు మాధవి, రవుఫ్‌ఖాన్, బొంకూరి శంకర్, సుధీర్, అనిత, సురేశ్, మహేందర్‌రెడ్డి, సంగీత, ప్రవీణ్, అంజి, కొమురయ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ, సీఐ

పెద్దపల్లిరూరల్: ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడలు క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని ఏసీపీ ఎడ్ల మహేశ్ అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో శుక్రవారం జరిగిన కేసీఆర్ కప్ క్రికెట్ పోటీల సెమిఫైనల్స్‌లో పాల్గొన్న క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలు శరీర ధారుఢ్యాన్ని పెంచడంతో పాటు స్నేహసంబంధాలను పెంచుతాయన్నారు. ఏసీపీ వెంట సీఐ ప్రదీప్ తదితరులున్నారు.

ఆదమరిస్తే అంతే..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామగుండం నగరపాలక సంస్థ పరిధి సప్తగిరికాలనీలోని ప్రాంతం. గత ఏడాది ఆగస్టు 21న ఫరూఖ్‌నగర్ డిపోకు చెందిన కార్గో బస్‌లో ఇక్కడి మహాత్మాజ్యోతి బాపూలే స్కూల్, హాస్టల్‌కు బుక్స్ తరలిస్తుండగా స్కూల్ సమీపంలో ఇరుకుగా, శిలావస్థలో ఉన్న కల్వర్టులో బస్సు దిగబడింది. అతికష్టం మీద బస్సును బయటకు తీశారు. ఇదే దారిలో రెండు ప్రభుత్వ హాస్టళ్లు, మరో రెండు ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా ఉన్నాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులను బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల ద్వారా తరలించడానికి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు నిర్మాణం చేయాలని పలు విద్యార్థి సంఘాలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు, ఘటన ప్రాంతంలో ఆందోళన చేశాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.





ఈ ఫొటోలో కనిపిస్తున్నది పెద్దపల్లి–ధర్మారం వెళ్లే రహదారి వెంట ప్రమాదకరంగా ఉన్న బావి. పెద్దపల్లి నుంచి ధర్మారం వెళ్లడానికి ఉన్నది ఈ ఒక్క రహదారియే. నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రహదారి వెంట కంచెలు లేకుండా చాలా చోట్ల బావులు ప్రమాదకరంగా ఉన్నాయి.

- రోడ్డుపక్కన ప్రమాదకరంగా బావులు, కాలువలు
- వణుకు పుట్టిస్తున్న మూలమలుపులు
- ప్రమాదం జరిగినప్పుడే హడావుడి.. తర్వాత యథావిధి
- రక్షణ చర్యలపై పట్టింపులేని యంత్రాంగం

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలోని పలు ప్రధాన, అంతర్గత రహదారులపై ప్రయాణం వణుకు పుట్టిస్తోంది. రోడ్ల పక్కనే ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులు, కాలువలు, మూలమలుపులు డేంజర్ జోన్లుగా మారాయి. హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. అందులో ఉన్నవారు వెంటనే కారు నుంచి బయటకు దూకడంతో పెనుప్రమాదం తప్పింది. జిల్లాలో చాలా చోట్ల రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నా ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలేదు. సైడ్ వాల్ లేక వాహనదారులు భయంభయంగా ప్రయాణిస్తున్నారు.

దడ పుట్టిస్తున్నా కానరాని చర్యలు

జిల్లాలోని పలు గ్రామాల ప్రధాన రహదారులపై మూలమలుపులు వాహనదారులకు దడపుట్టిస్తున్నాయి. రాత్రి సమయాల్లో మూలమలుపులు కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా అధికారులు మాత్రం ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. తరచూ ద్విచక్ర వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీ, వ్యాన్, కార్లు, ఆటోలు బోల్తాపడిన సంఘటనలున్నాయి. సాగునీటి కాలువలు, బావులు ఎక్కువగా ఉన్న చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు తీవ్రతను బట్టి ప్రహరీలను నిర్మించాలనే నిర్ణయాలు ఆచరణకు నోచుకోవడం లేదు. ఎక్కడికక్కడే క్షేత్రస్థాయిలో లెక్కలు గట్టి ప్రమాదకరంగా ఉన్న బావులను గుర్తించారు. ఇందులో రోడ్డుకు అత్యంత దగ్గరలో, కొంచెం దూరంలో అని కేటగిరీలు కూడా చేశారు. వీటి వద్ద రక్షణగా ప్రహరీల నిర్మాణానికి నిధుల్ని అంచనా వేశారు. తరువాత ప్రతిపాదనల దశలోనే మిగిలిపోయాయి. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఈఈ నర్సింహాచారిని వివరణ కోరగా.. జిల్లాలో రోడ్డు వెంట ప్రమాదకరంగా ఉన్న బావులను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి రక్షణ చర్యలు చేపడుతామని తెలిపారు.



ఇది నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే రాజీవ్‌రహదారి వెంబడి రామగుండం కమిషనరేట్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు. రాత్రి వేళ తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా కాలువ సైడ్‌కు రక్షణ చర్యలు చేపట్టడంలేదని పట్టణవాసులు వాపోతున్నారు.



బసంత్ నగర్ విమానాశ్రయ ప్రతిపాదిత స్థలానికి సమీపంలో మండల ప్రధాన రహదారిని అనుకుని మూలమలుపు వద్ద గల ఎస్సారెస్పీ డీ–83 కాలువ ఉపకాలువ అయిన ఎల్–1 కాలువ ఉంది. ఈకాలువను సూచిస్తూ స్థానికంగా ఎలాంటి సైన్ బోర్డ్ లేకపోవడంతో మండల ప్రధాన రహదారిపై పలువురు వాహనదారులు గమనించకుండా నేరుగా కాలువలోకి దూసుకెళ్తున్నారు. గతంలో కాలువలో సుమో, బైక్ లు పడిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. అయినా సంబంధిత అధికారులు ఇప్పటికీ ఎలాంటి సైన్‌బోర్డ్‌లు ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు బసంత్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ఈకాలువ ఉండడం, ఎలాంటి ఫెన్సింగ్ లేకపోవడం, వీధి దీపాలు కూడా లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.



ఈచిత్రంలో కనిపిస్తున్నది పెద్దపల్లి– గోదావరిఖని మధ్య ఉన్న బందంపల్లి రాజీవ్‌రహదారి. ఈరోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు, బావుల మధ్య సైడ్ గోడలు లేక.. రాత్రి వేళల్లో వాహనదారులు పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంటున్నా అధికారులు మాత్రం ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టడంలేదు.

ఎన్టీపీసీ ఠాణాను సందర్శించిన డీసీపీ



రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ వైభవ్ గైక్వాడ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం పెద్దపల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్ సందర్శించారు. ఈసందర్భంగా డీసీపీకి ఎస్సై బి.జీవన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ స్టేషన్‌లోని రికార్డులు, లాకప్, రిసెప్షన్‌తో పాటు ఠాణా ఆవరణలోని మొక్కలను పరిశీలించారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పోలీసులు భరోసా కల్పించే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఏసీపీ గిరిప్రసాద్, రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించాలి



మాట్లాడుతున్న కృష్ణ

జ్యోతినగర్(రామగుండం): కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఐ.కృష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు అనేక ఉద్యమాలు చేసి చాలా ఒప్పందాలు చేసుకుంటే యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందాలను తొక్కిపెట్టి వారిని శ్రమ దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో కార్మికులకు యాజమాన్యం కనీస వేతనాలు కల్పించకుండా కట్టుబానిసలుగా పనులు చేయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.రాజన్న, అధ్యక్షుడు ఐ.కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, ఉపాధ్యక్షుడు రాజేశం, సహాయ కార్యదర్శి బుచ్చయ్య, కోశాధికారి రాజేశంతో పాటు పలువురిని ఎన్నుకున్నారు. సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న తోకల రమేశ్‌ను తొలగించడం జరిగిందని వెల్లడించారు. సమావేశంలో వెంకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, అశోక్, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..

- మానకొండూర్ నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగిన రేవంత్ యాత్ర
- 15 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజలతో మమేకమైన కాంగ్రెస్ చీఫ్
- మానకొండూర్ సభలో బీఆర్ఎస్ నేతలపై నిప్పులు

తిమ్మాపూర్/మానకొండూర్: భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం నుంచి శుక్రవారం ప్రారంభమైన యాత్ర మానకొండూర్ వరకు ఉత్సాహంగా సాగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు రేవంత్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ఊరూరా కార్యకర్తలు, ప్రజలు, మహిళలు రేవంత్‌కు ఘనస్వాగతం పలికారు. మొగిలిపాలెంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి సుస్మితారమణారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. పర్లపల్లి వరకు బైక్‌ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి పోలంపల్లికి చేరుకొని మధ్యాహ్నం 12.30 గంటలకు గ్రామశివారులో భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభంకాగా 7 గంటల వ రకు మానకొండూరు చేరారు. సుమారు 15 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. మధ్యలో మల్లాపూర్‌లో సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి ఇంట్లో టీ విరామం తీసుకున్నారు. మన్నెంపల్లిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. ఇంది రాగాంధీ విగ్రహావిష్కరణ చేశారు. పోరండ్లలో బొజ్జ లచ్చవ్వ తన భర్త ఐదేళ్ల క్రితం చనిపోయినా.. తన పేరున భూమి మార్పిడి జరగడంలేదని రేవంత్‌కు విన్నవించింది. సాక్షర భారత్ కోఆర్డినేటర్లను విధుల్లో నుంచి తొలగించినందు కు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తాము అధికారంలోకి వచ్చాక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సెక్యూరిటీ అత్యుత్సాహం

పాదయాత్ర భోజన విరామ సమయంలో ప్రైవేట్ సెక్యూరిటీ అత్యుత్సాహం చూపించారు. ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మీడియా ప్రతినిధులతో దురుసుగా మాట్లాడారు. బౌన్సర్ల నిర్లక్ష్యంతో ఓ డప్పు కళాకారుడికి స్వల్ప గాయాలయ్యాయి. తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి వద్ద గీకురు నర్సయ్యను రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. సాయంత్రం ఏడుగంటలకు మానకొండూర్‌లో సభ నిర్వహించారు.



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



ఇందిరాగాంధీ విగ్రహావిష్కరణ చేస్తున్న రేవంత్‌రెడ్డి నాయకులు

అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తాం

మానకొండూర్‌లో ఏర్పాటుచేసిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొందరు బీఆర్ఎస్ వాళ్లు కాంగ్రెస్ ఏం చేసిందని మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్‌మెంటు అందించామని అన్నారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు జాతీయ రహదారి, ఔటర్‌రింగురోడ్డు, శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. మీరు ఇప్పుడు సెల్ఫీలు దిగుతున్న శిల్పారామం కాంగ్రెస్ కట్టిందేనని కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ.. ఎద్దేవా చేశారు. రెండుసార్లు అవకాశం ఇస్తే రాష్ట్రానికి సీఎంగా కేసీఆర్, మానకొండూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తనకన్నా ముందు ముగ్గురు ఎంపీలు కరీంనగర్ నుంచి ప్రాతినిథ్యం వహించారని, వారు పదిశాతం కూడా అభివృద్ధి చేయలేదని అన్నారు. ఒకవేళ తనకన్నా ఎక్కువ అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం పుచ్చుకుంటానని పొన్నం సవాల్ విసిరారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూర్ వరకు రహదారి నిర్మాణం తమ పోరాటమే అని గుర్తు చేశారు. రసమయిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్యరావు థాక్రే, మాజీ ఎంపీలు సిరిసిల్ల రాజయ్య, అంజనికుమార్ యాదవ్, వేణుగోపాల్, మానకొండూర్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్, శంకర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

చర్చలేకుండా ముగిసిన బడ్జెట్ మీటింగ్



మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): ఎలాంటి చర్చలేకుండానే రామగుండం నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశం కేవలం అరగంటలో ముగిసింది. శుక్రవారం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బడ్జెట్ మీటింగ్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.221 కోట్ల 88 లక్షల 48 వేల అంచనా బడ్జెట్‌కు జనరల్ బాడీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బడ్జెట్ సమావేశం అనంతరం 12వ సాధారణ సమావేశం కూడా నిర్వహించగా అది కూడా గంటలో ముగిసింది. అయితే జనరల్ బాడీ మీటింగ్‌లో అసలుకంటే కొసరెక్కువ అన్న తరహాలో ఎజెండా అంశాలు భారీ సంఖ్యలో పెరిగాయి. దీనిపై ఒక్క సభ్యుడు కూడా అభ్యంతరం తెలుపలేదు. తొలత 65 అంశాలను పొందుపరిచి కార్పొరేటర్లకు ఎజెండాలను పంపిణీ చేసిన అధికారులు, జనరల్ బాడీ నిర్వహిస్తున్న సమయంలో ఏకంగా 72 అంశాలను టేబుల్ ఎజెండా రూపంలో ప్రవేశపెట్టారు. మొత్తం 137 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. శానిటేషన్ విభాగంలో వాహనాల మరమ్మతులకు విచ్చలవిడిగా నిధులు ఖర్చు చేస్తున్నారని కాంగ్రెస్ కార్పొరేటర్ కొలిపాక సుజాత ఆరోపించగా, స్పందించిన అధికారులు సమావేశంలో రికార్డులను పరిశీలనకు తెప్పించి వివరించారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ హాజరయ్యారు.

ఆదాయం పెంచుకునే దిశగా..

సమావేశంలో మేయర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఆదాయం పెంచుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే చందర్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వెల్లడించారు. మెడికల్ కళాశాల ప్రారంభం, కూడళ్ల సుందరీకరణ, పట్టణ ప్రగతి తదితర నిధులతో ఒక్కో డివిజన్‌లో సరాసరి రూ.45 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు అభివృద్ధి పనులు జరగడం ఇందుకు నిదర్శనమన్నారు.

బల్దియాకు వచ్చే ఆదాయం తక్కువ

ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే రామగుండం బల్దియాకు వచ్చే ఆస్తి పన్ను, సాధారణ నిధుల ఆదాయం చాలా తక్కువగా ఉందని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. అదనపు ఆదాయం సమకూర్చుకునే ప్రయత్నాలు చేయాలని సూచించారు. సమావేశాల్లో డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కమిషనర్ సుమన్‌రావు, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బీ–థర్మల్‌లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 6గంటలకు విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చిన అరగంట వ్యవధిలోనే ఎలక్ట్రికల్ విభాగంలో సాంకేతికలోపం తలెత్తడంతో మళ్లీ ప్లాంటు ట్రిప్ అయింది. దీంతో రెండు మూడు గంటల పాటు పునరుద్ధరించి ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా జనవరిలో ఆరుసార్లు, ఫిబ్రవరిలో మూడు సార్లు, మార్చిలో రెండుసార్లు విద్యుత్ కేంద్రం ట్రిప్ అయి మళ్లీ పునరుద్ధరించేందుకు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నా.. అధికారులు శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించుకునేందుకు నిధులు కేటాయించకపోవడం గమనార్హం. కాగా ఇప్పటికే బొగ్గు, ఆయిల్ నిల్వలు అడుగంటిపోయిన క్రమంలో మరో రెండుసార్లు ఇదే సమస్య పునరావృతమైతే శాశ్వతంగా మూసివేయక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా రెండు మాసాలుగా బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలకు తోడు ప్రస్తుత సీజన్‌లో విద్యుత్‌కు ఉన్న డిమాండ్ నేపథ్యంలో ఉత్పత్తిలో తరచూ అంతరాయం ఎదురవుతుండడంతో ఇంజినీర్లు, ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు బాయిలర్స్ ట్యూబ్స్ వద్ద సమస్య వస్తుండగా ఇప్పుడు నూతనంగా మరో విభాగంలో సమస్య తలెత్తడం మరింత అసహనానికి గురి చేస్తుందంటున్నారు. కాగా ప్రస్తుతం ఉత్పత్తి దశలోకి తీసుకువచ్చిన విద్యుత్ కేంద్రం ఎన్ని గంటలు నిరాటకంగా నడుస్తుందోనని అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఇదే పరిస్థితి రెండుమూడు రోజులు ఎదురైతే బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం కొనసాగింపుపై ఉన్నతాధికారుల నిర్ణయం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాలి.

నేడు శాసనమండలి చీఫ్ విప్ రాక

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్ విప్ తానిపర్తి భానుప్రసాద్‌రావు శనివారం పెద్దపల్లి రానున్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి ఆయన హాజరుకానున్నారు. మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్‌లు కూడా వస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. దుబ్బపల్లి నుంచి బైక్ ర్యాలీగా బయలుదేరి గర్రెపల్లి, నర్సయ్యపల్లి, కాట్నపల్లి మీదుగా వెళ్లి, సుల్తానాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తారని పేర్కొన్నారు. సమావేశ ఏర్పాట్లను ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి దగ్గరుండి చూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్ గాజుల లక్ష్మి కోరారు.

క్లుప్తంగా

పెద్దపల్లికి వచ్చిన కాన్షీరాం కుటుంబీకులు

- నేడు ఆయన విగ్రహావిష్కరణ



కాన్షీరాం సోదరి స్వరణ్‌కౌర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: కాన్షీరాం సోదరి స్వరణ్‌కౌర్ తోపాటు కుటుంబసభ్యులు పెద్దపల్లి వచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్‌సన్నీ, టీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు బొంకూరి శంకర్, ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శన్ తదితరులు స్వాగతం పలికారు. పట్టణంలోని జెండా కూడలి వద్ద ఏర్పాటు చేసిన కాన్షీరాం విగ్రహాన్ని శనివారం స్వరణ్‌కౌర్ చేతులమీదుగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

సంచార ప్రయోగశాలతో విద్యార్థులకు మేలు



ప్రయోగాల ద్వారా విద్యార్థులకు వివరిస్తున్న సైన్స్ అధికారి రవినందన్‌రావు

గోదావరిఖనిటౌన్(రామగుండం): జిల్లాలోని ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ అభిరుచి, పరిశీలనాత్మక శక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో సంచార విజ్ఞాన–గణిత ప్రయోగశాలలను ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు తెలిపారు. శుక్రవారం గోదావరిఖని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సంచార ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు పలు ప్రయోగాల గుణాత్మక విద్యనందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 122 ఉన్నత పాఠశాలలకుగాను ఇప్పటికే 105 స్కూళ్లలో ఈ విద్యాసంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసినట్లు వివరించారు. మండలాల వారీగా రోజూ రెండు పాఠశాలల్లో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని 6 బృందాలు, 57 మంది విషయ నిష్ణాతులతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో భర్తకు 18 నెలల జైలు

గోదావరిఖని(రామగుండం): స్థానిక కాకతీయనగర్ చెందిన చింతల తిరుమలను అదనపు వరకట్నం కోసం వేధించిన కేసులో ఆమె భర్త రమేశ్‌కు జడ్జి 18 నెలల కఠిన కారాగార శిక్ష విధించినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2015లో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రమేశ్‌పై తిరుమల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఉపేందర్ వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఆరుకొండ సతీశ్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ నహీదపర్వీన్ పర్యవేక్షణలో ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దుర్గం గణేశ్ సాక్ష్యాధారాలు పరిశీలించారు. నిందితుడికి 18 నెలల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. రమేశ్‌కు శిక్ష పడేందుకు కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్, సిబ్బందిని సీఐ అభినందించారు.

డాడీ.. లేచి మమ్మల్ని ముద్దు పెట్టుకో

- గుండెపోటుతో మృతిచెందిన తండ్రి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కూతుళ్లు, భార్య
- మృతుడు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ సోదరుడు శైలేందర్‌సింగ్



మృతదేహం వద్ద రోదిస్తున్న శైలేందర్ సింగ్ కూతుళ్లు, భార్య



శైలేందర్ సింగ్ (ఫైల్)

రామగుండం: 'డాడీ మేము స్కూల్ నుంచి వచ్చేసరికి నువ్వు వస్తానన్నావు.. హోలీ పండుగ రోజు రంగులు పూసుకొని, ఆడుకుందామన్నావు.. మేము వచ్చాము.. లేచి మమ్మల్ని ముద్దు పెట్టుకో డాడీ.. మమ్మీ మా ఇద్దరినీ పట్టుకొని ఏడుస్తుంది'.. అంటూ ఆ చిన్నారులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ సోదరుడు శైలేందర్‌సింగ్(44) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శైలేందర్‌సింగ్ బిల్డర్. ఆయనకు భార్య సరోజ్‌ఠాగూర్, కూతుళ్లు కనీషాసింగ్, అనితాసింగ్ ఉన్నారు. భార్యాపిల్లలు హైదరాబాద్‌లో ఉంటుండగా శైలేందర్‌సింగ్ గోదావరిఖనిలో కన్‌స్ట్రక్షన్ పనుల నిమిత్తం స్థానిక కేసీఆర్ కాలనీలోని శ్రీనిధి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. మూడు రోజులకోసారి హైదరాబాద్ వెళ్లి, కుటుంబంతో గడిపి, వస్తుండేవాడు. శుక్రవారం ఉదయం పైఅంతస్తు నుంచి కిందకు వెళ్లేందుకు లిఫ్ట్ వద్దకు వెళ్లగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. అక్కడున్నవారు పరిగెత్తుకు వచ్చి, పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆయన భార్యాపిల్లలు హైదరాబాద్ నుంచి బయలుదేరి, సాయంత్రం 4 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. మృతుడి అత్తామామ గుజరాత్ నుంచి రావాల్సి ఉంది. అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రముఖుల నివాళి..

శైలేందర్‌సింగ్ మృతి వార్త తెలియడంతో గోదావరిఖని పట్టణంలోని ఆయన ఇంటికి పార్టీలకతీతంగా ప్రముఖులు, నాయకులు తరలివచ్చారు. శైలేందర్‌సింగ్ సోదరులు అయోధ్యసింగ్, మక్కాన్‌సింగ్‌లను పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ, కౌశికహరి, కాంగ్రెస్ జాతీయ నాయకుడు బాబర్ సలీంపాషా, కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్, కన్నూరి సతీశ్‌కుమార్, కౌశిక లత, మహంకాళి స్వామి, ధర్మపురి, గుమ్మడి కుమారస్వామి, ఠాకూర్ రఘువీర్‌సింగ్, మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. హైదరాబాద్ నుంచి శైలేందర్‌సింగ్ అభిమానులు వచ్చారు. కాగా కుటుంబసభ్యులు శైలేందర్‌సింగ్ నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి, టెక్నీషియన్ ఆరిఫ్ ద్వారా నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు.

మహిళలకు ఆటల పోటీలు



యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సీఈఆర్ క్లబ్ ఆవరణలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. కాలనీ, పోతన కాలనీకి చెందిన సింగరేణి మహిళ ఉద్యోగులు, గృహిణులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు ఆర్జీ–2 డీజీఎం పర్సనల్ అండ్ అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

నేడు గోదావరిఖనిలో..

గోదావరిఖని(రామగుండం): శనివారం గోదావరిఖనిలోని జీఎం కాలనీ గ్రౌండ్‌లో మహిళలకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జీఎం కె.నారాయణ తెలిపారు. సింగరేణి మహిళా ఉద్యోగులు, సేవా ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు, గృహిణులు సాయంత్రం 3 గంటలకు జరిగే ఆటల పోటీలకు నేరుగా హాజరు కావాలని సూచించారు. విజేతలకు ఈ నెల 8న మహిళా దినోత్సవం రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

15 రోజుల్లో పెళ్లి.. ఇల్లు దగ్ధం



వెన్నంపల్లిలో కాలిపోయిన గుడిసె



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- యువతి వివాహానికి ఆమె మేనమామ ఇంటి వద్ద ఏర్పాట్లు
- నిప్పురవ్వలు గుడిసెపై పడి వ్యాపించిన మంటలు
- కాలిబూడిదైన రూ.5 లక్షలు, బంగారం, పెళ్లి దుస్తులు, సామగ్రి
- రూ.19 లక్షల వరకు ఆస్తి నష్టం
- కన్నీరుమున్నీరైన బాధితులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మరో 15 రోజుల్లో ఆ యువతికి పెళ్లి.. మేనమామ ఇంటి(గుడిసె) వద్ద ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. వివాహానికి అవసరమైన దుస్తులు, బంగారం, కట్నం డబ్బులు సిద్ధం చేసుకున్నారు. ఇంతలోనే ప్రమాదం నిప్పురవ్వల రూపంలో వచ్చి, ఆ గుడిసెను దగ్ధం చేసింది. ఈ ఘటనలో సుమారు రూ.19 లక్షల ఆస్తినష్టం జరగడంతో బాధితుల రోదనలు మిన్నంటాయి. వివరాల్లోకి వెళ్తే.. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని వెన్నంపల్లికి చెందిన ఉడుత రాజయ్య–రేణుక దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుమార్తెను రాజయ్య తన అక్క కుమారుడికి ఇచ్చి వివాహం చేశాడు. రెండో కుమార్తెకు ఈ నెల 18వ తేదీన పెళ్లి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అతని తల్లి మృతిచెందింది. దీంతో పెళ్లి పత్రికలు, 15 తులాల బంగారం, దుస్తులు, పెళ్లి సామగ్రి, రూ.5 లక్షలను తన అక్క–బావ అదే గ్రామానికి చెందిన కాసాని పోసాని–ఐలయ్యల గుడిసెలో ఉంచాడు. అక్కడే వివాహం చేయాలని కూడా అనుకున్నారు.

సెకన్లలో కాలిపోయిన గుడిసె..

ఈ క్రమంలో శుక్రవారం ఐలయ్య ఇంటి సమీపంలో అప్పని రాజయ్య చేనులో పత్తి కొయ్యలను కాలబెట్టారు. గాలికి నిప్పు రవ్వలు ఎగిరివచ్చి, ఐలయ్య గుడిసెపై పడ్డాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగి, సెకన్లలోనే గుడిసె దగ్ధమైంది. లోపల వివాహానికి సంబంధించిన సామగ్రి కాలిబూడిదైంది. పెద్దపల్లి నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చినా ఫలితం లేకుండా పోయింది. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటన ఆ కుటుంబాన్ని అతలాకుతలం చేసింది. పెళ్లికి ముందు రూ.19 లక్షల వరకు ఆస్తి నష్టం జరగడంతో బాధిత కుటుంబసభ్యులు రోదించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శ..

ఐలయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి, ఓదార్చారు. పెళ్లింట అగ్ని ప్రమాదం విషాదం నింపిందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు వంగళ తిరుపతి రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జట్టి దేవేందర్, సర్పంచు శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 19 శాతం

కార్మికుల విజయం

- ఎస్‌సీఎంకేఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): బొగ్గు గని కార్మికుల జేబీసీసీఐ వేతన ఒప్పందంలో మినిమం గ్యారెంటీ బెనిఫిట్ 19 శాతానికి ఒప్పందం కుదిరిందని సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(ఎస్‌సీఎంకేఎస్–బీఎంఎస్ అనుబంధం) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. శుక్రవారం రామగుండం ఏరియా–జీడీకే–2ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు ఆందోళనలకు సిద్ధమైన తరుణంలో యాజమాన్యాలు దిగివచ్చి, ఒప్పందం చేసుకున్నాయని, ఇది బొగ్గు గని కార్మికుల విజయమన్నారు.

కనీస పెరుగుదల ఇలా..

కార్మికులకు కేటగిరీ–1 బేసిక్ రూ.1,011.27 నుంచి రూ.1,502.67, వేతన పెరుగుదల రూ.6,973.73, ఏ–1 కార్మికులకు బేసిక్ రూ.47,802.53 నుంచి 71,030.57కి పెరిగి, కనీస వేతనం రూ.12,678.69 పెరిగిందని తెలిపారు. 9వ సమావేశంలో వెంటనే ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో వేతన ఒప్పందం చేయాలన్నారు. మొండిగా ఉన్న కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాల వైఖరిలో మార్పు రావాలని కార్మికులందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. గత వేతన ఒప్పందంలో మాదిరిగా మెడికల్ స్కీం, పెన్షన్, క్యాడర్ స్కీం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ త్వరలో జరిగే జేబీసీసీఐ సమావేశంలో చర్చించి, పరిష్కారం చూపాలన్నారు.

విద్యుత్, బొగ్గు బకాయిలు చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లను సింగరేణి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సంస్థ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సంస్థ రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న బీఎంఎస్‌ను రానున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆశీర్వదించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. నాయకులు ఆకుల హరిజ్, దాట్ల లక్ష్మయ్య, పల్లె శ్రీనివాస్, సంగాని సాంబయ్య, మంచినీళ్ల స్వామి, భీమునిపెల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

రామగిరి(మంథని): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంటినరీకాలనీ రాణీ రుద్రమదేవి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు తన్నీరు శ్రీదేవి మాట్లాడుతూ.. ఆటలపోటీల వల్ల మహిళలకు మానసికోల్లాసం కలగడంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఈ నెల 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. త్రోబాల్, లెమన్ స్పూన్, బాల్ ఇన్ గ్లాస్, డిస్కత్రో పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏపీఏ జీఎం సతీమణి విజయ, సేవా సభ్యులు పాల్గొన్నారు.



త్రోబాల్ ఆడుతున్న సేవా అధ్యక్షురాలు శ్రీదేవి

మోదీ పాలనలో ప్రజలకు సచ్చేదిన్

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజా సంక్షేమాన్ని సమాధి చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మహా నిరసన కార్యక్రమం చేపట్టారు.ఎనిమిదేళ్ల కాలంలో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,177కు పెంచిన ఘనత కేంద్రానికే దక్కిందన్నారు. 'బీజేపీ హటావో.. తెలంగాణ బచావో' అని నినదించారు. ఖాళీ సిలిండర్లు, నల్ల జెండాలతో నిరసన తెలిపి రోడ్డుపైనే కట్టెల పొయ్యిపై వంటావార్పు చేశారు. కార్యక్రమానికి గోపు ఐలయ్య యాదవ్, పలు సంఘాల బాధ్యులు సంఘీభావం తెలిపారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, మూల విజయరెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

పేదలపై ఆర్థిక భారం మోపుతారా..?

పెద్దపల్లిరూరల్: బీజేపీ సర్కార్ పేదలపై ఆర్థిక భారాన్ని మోపేలా గ్యాస్‌సిలిండర్ల ధరలను పెంచడం సరికాదని, వెంటనే తగ్గించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని కమాన్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాజీవ్‌రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ మమతారెడ్డి సారథ్యంలో మహిళా కౌన్సిలర్లు, నాయకురాళ్లు రోడ్డుపై వంటావార్పు చేశారు. పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మండల అధ్యక్షుడు మర్కు లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.



రోడ్డుపై వంట చేస్తున్న ఎమ్మెల్యే చందర్

జీడీకే–5 ఓసీపీలో పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఓపెన్‌కాస్టు–5లో పలు అభివృద్ధి పనులను ఆర్జీ–1 జీఎం నారాయణ ప్రారంభించారు. శుక్రవారం వాషింగ్ ప్లాట్‌ఫాం, వాటర్ స్టోరేజ్ ట్యాంక్, బేస్ వర్క్‌షాప్ పిట్ స్టోర్ల నిర్మాణానికి భూమిపూజ చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. భూగర్భ, ఉపరితల గనుల్లో అనేక పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వాషింగ్ ప్లాట్ ఫాం నిర్మాణం కోసం రూ.70 లక్షలు, వాటర్ స్టోరేజ్ ట్యాంక్ కోసం రూ.16 లక్షలు, బేస్ వర్క్‌షాప్ మెటీరియల్ స్టోరేజ్ కోసం రూ.20 లక్షలు కేటాయించినట్లు వివరించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను రెండు నెలలు ముందుగానే సాధించినట్లు తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులు, ఉద్యోగులు, కార్మికులను ఆయన అభినందించారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగి, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపు

కార్మికుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. శుక్రవారం వర్క్‌పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 56వ క్రీడా వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. క్రీడలు ఉద్యోగులకు మానసికోల్లాసం కలిగిస్తాయని చెప్పారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి జీఎం బహుమతులు అందజేశారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్ రావు, సీఎంఓఏఐ అధ్యక్షుడు పానగోటి శ్రీనివాస్, ఎస్ఓటూ జీఎం రామ్మోహన్, డీజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీఓ బంగారు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ కోరితే.. రూ.2 వేలు అడిగిండు

- అడిగినదాంట్లో రూ.500 ఇయ్యకపోతే పెన్షన్ ఆపిండు
- పెద్దంపేట పంచాయతీ కార్యదర్శిపై ఎంపీపీకి వృద్ధుడి ఫిర్యాదు



ఎంపీపీకి మొరపెట్టుకుంటున్న మల్లారెడ్డి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాళ్లుచేతులు సహకరిత్తలేవు.. గుంట భూమి లేదు. ఆసరా పింఛన్ మంజూరు చేసి, ఆదుకోండ్రి సారూ అని బతిలాడితే పంచాయతీ కార్యదర్శి వెంకన్న నాయక్ రూ.2 వేలు లంచం అడిగిండని కాల్వశ్రీరాంపూర్ మండలంలోకి పెద్దంపేటకు నిరుపేద వృద్ధుడు పల్నాటి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్‌ను కలిసి మొరపెట్టుకున్నాడు. మందుల కోసం దాచుకున్న రూ.1,500 ఇచ్చానని, మరో రూ.500 ఇవ్వనందుకు పెన్షన్ రాకుండా చేశాడని వాపోయాడు. స్పందించిన ఎంపీపీ దీనిపై అధికారులను ప్రశ్నించగా ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపాల వల్ల పెన్షన్ మంజూరు కాలేదని సమాధానం ఇచ్చారు. మల్లారెడ్డికి పింఛన్ కోసం ఉన్నతాధికారులకు రిక్వెస్ట్ చేస్తామని ఎంపీడీవో రామ్మోహన్ హామీ ఇచ్చారు.

'ట్రినిటీ'లో ఆకట్టుకున్న యూత్ ఫెస్ట్ మేధా–23



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో స్టేట్ లెవల్ యూత్ ఫెస్ట్ మేధా–23ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, షార్ట్ ఫిలిమ్స్, క్విజ్ తదితర పోటీలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాకతీయ, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.